క్లుప్తంగా

తెలుగు భాష మధురమైనది

కర్నూలు (సెంట్రల్): తెలుగు భాష మధురమైనదని, ప్రతి ఒక్కరూ తెలుగులో రాయడం, చదవటం నేర్చుకోవాలని ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. గురువారం రాయలసీమ విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొలకలూరి ఇనాక్ రచించిన సాహిత్య బహుముఖ తత్వం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి నగరానికి చెందిన ప్రముఖ రచయిత చంద్రశేఖర కల్కూరా, రెక్టార్ కృష్ణారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.టి.కె.నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తెలుగు భాషపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. అప్పుడే మహానుభావుల జీవిత చరిత్రను పుస్తకాల రూపంలో రూపొందించగలమన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ ప్రొఫెసర్ అరుణ పాల్గొన్నారు.

పేదలకు మంచి చేసే నాయకుడు జగన్


బ్రోచర్స్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలోని పేదలకు మంచి చేసే నాయకుడు కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని గోశాల చైర్మన్ ఆది మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక రామలింగేశ్వరరెడ్డి నగర్‌లోని 115వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా ఎదిగేలా ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటికే పథకాలు అందించడం సీఎంకే సాధ్యమైందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సవారి, మేరి, జంగిలమ్మ, మహిధర్, రాము యాదవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎంసీలోకి డ్రగ్స్ చేరికపై విచారణ చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మెడికల్ కాలేజీలోకి డ్రగ్స్ ఎలా వచ్చాయనే సంఘటనపై విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా నడిబొడ్డులో ఉన్న మెడికల్ కాలేజీకి డ్రగ్స్ చేరడం, వాటిని భావి వైద్యులు సేవించడం అంటే మాదక ద్రవ్యాల సరఫరా విచ్చలవిడిగా సాగుతుందన్నారు. ఈ అంశంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మునిస్వామి, రవి, రాజశేఖర్, శివరాజు పాల్గొన్నారు.

మహిళా సాధికారతను విస్మరించిన ప్రభుత్వాలు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతను విస్మరించాయని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు విమర్శించారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా సేవాదళ్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏ వెంకట సుజాత ఆధ్వర్యంలో సేవాదళ్ మహిళా సాధికార సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకివచ్చాక గ్యాస్ సిలిండర్‌ను విపరీతంగా పెంచుతూ పోవడంతో మహిళలు ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, నాయకులు బతుకన్న, బజారన్న, ప్రమీళ, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

కర్నూలు(సెంట్రల్): పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమని భవన నిర్మాణ సంక్షేమ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు సుధాకరప్ప, ఆర్.నరసింహులు అన్నారు. గురువారం కల్లూరులోని మట్టి అడ్డాలో కొందరు కార్మికులు భవన నిర్మాణ సంక్షేమ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవననిర్మాణ కార్మికుల కోసం కేటాయించిన నిధులను దారి మళ్లించడం అన్యాయమన్నారు.

అక్రమాలపై విచారణకు రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలోని కొత్తపేట రైతుబజారు ఎస్టేటు అధికారి అక్రమాలపై విచారణకు రంగం సిద్ధమైంది. వ్యాపారుల నుంచి ఎస్టేటు ఆఫీసర్ అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఇటీవల జేసీ నారపురెడ్డి మౌర్య ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు విచారణకు ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. బృందం ఇచ్చే నివేదిక మేరకు ఎస్టేట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకుంటారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలోని అన్ని మండలాను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఆయన మాట్లాడుతూ..కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. కరువు సహాయక చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

స్పోర్ట్స్ హబ్‌గా కర్నూలు

- ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్
- రూ.74 లక్షలతో బాస్కెట్‌బాల్ సింథటిక్ కోర్టు ప్రారంభం



క్రీడాకారులతో కలసి బెలూన్లు ఎగురవేస్తున్న ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, నూతన బాస్కెట్‌బాల్ సింథటిక్ కోర్టులో సాధన చేస్తున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్): కర్నూలును స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్ వెల్లడించారు. గురువారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో రూ.74 లక్షలతో ఏర్పాటు చేసిన అధునాతన సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టును కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, నగర మేయర్ బీవై రామయ్యతో కలసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాలిలోకి బెలూన్లు ఎగురవేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కర్నూలులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతుంటే ప్రతిపక్షాలకు కనిపించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. తమ వంతుగా క్రీడల అవసరాలు, నిర్వహణకు తన ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేవలం చదువులకే పరిమితం కాకుండా విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలను తప్పనిసరిగా ఒక అంశంగా ఎంచుకుని ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. నగరమేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వం క్రీడా రంగానికి విశేషంగా సేవలు అందిస్తోందన్నారు. కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల రూ.1.30 కోట్లతో రెండు ఇండోర్ స్టేడియాలు, రూ.80 లక్షలతో టెన్నిస్ అకాడమీ, క్రికెట్ నెట్స్ ఏర్పాటు చేశామన్నారు. తమ హయాంలో రెండేళ్ల వ్యవధిలోనే ఒక్క కర్నూలు నగరంలోనే రూ.550 కోట్లకు పైగా అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతుంటే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినీ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడాపోటీలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. రెండు సంవత్సరాలుగా స్కూల్‌గేమ్స్ క్రీడలు, ఏపీ సీఎం కప్‌తో పాటు త్వరలో ఆడుదాం ఆంధ్రా వంటి క్రీడాపోటీలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ, డీఈ సుదర్శన్ బాబు, ఏఈ స్వామిరెడ్డి, చీఫ్ కోచ్ శ్రీనివాసరావు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధ్యేయం

కర్నూలు (టౌన్): రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎగ్జిబిషన్ మైదానంలో రూ.కోటి వెచ్చించి నగరపాలక సంస్థ నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, నగర మేయర్ బీవై రామయ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి సచివాలయంలో ఉచితంగా వైద్యసేవలు, మందులు, కంటి పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారన్నారు. రాయలసీమలోనే తలమానికంగా ఉన్న కర్నూలు ప్రభుత్వాసుపత్రితో పాటు ఇప్పుడు నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో రూ.12 కోట్లతో 12 డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ కర్నూలును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు కావాల్సిన మెరుగైన సౌకర్యాలు, అభివృద్ధి పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ అందరికీ వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఈ అర్బన్ హెల్త్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యూనుస్ బాషా, ఫరాజ్ ఖాన్, విజయలక్ష్మి, కృష్ణకాంత్, కోఆప్షన్ మెంబర్లు చాట్ల మేరి, నయీం పాషా, మున్సిపల్ ఈఈలు శేషసాయి, షాకీర్ హుసేన్, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న సాయి భక్తులు

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకలు గురువారం నెహ్రూ నగర్‌లోని శ్రీ సత్యసాయి మందిరంలో వైభవంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, పతాకావిష్కరణ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి బాబా వారికి అభిషేకం, కేక్ కటింగ్, భజన, మంగళహారతి, వేద పఠనం, ఝూల ఉత్సవం నిర్వహించారు. స్వామి సందేశం వినిపించారు. సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సేవా సమితి జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ లక్ష్మి సరోజ, సేవా దళ్ సభ్యులు సాయి సంధ్య, మాలతి, శారద, సాయిబాబా, వెంకటేష్, రత్నదీప్, యువజన విభాగం కన్వీనర్ సందీప్, వలంటీర్లు, భక్తులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

కర్నూలు కల్చరల్: ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శంకరాస్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, జీవన నైపుణ్యాలపై విజయ మహిళా మండలి ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుమలత మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండి ఉత్తమ సమాజ నిర్మాణంలో పాలు పంచుకోవాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మద్దిలేటి, ప్రాజెక్ట్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి


ఫొటో ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు, ప్రజలు


సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. స్థానిక ఉస్మానియా కళాశాలలో ఏర్పాటు చేసిన 'ముస్లిం ఫ్రీడం ఫైటర్స్ ఆఫ్ ఇండియా' ఫొటో ఎగ్జిబిషన్‌ను గురువారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా నడిచారని, చాలా మంది ముస్లింలు తమ ప్రాణాలను దేశం కోసం త్యాగం చేశారన్నారు. కొందరు కుటుంబాలను పోగొట్టుకుంటే, మరికొందరు తమ ఆస్తిపాస్తులన్నింటినీ దేశం కోసం అర్పించేశారని గుర్తు చేశారు. ఈ స్వాతంత్ర సమరయోధుల చిత్ర పటాలను సేకరించడంలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ కృషి ప్రశంసనీయమైందన్నారు. అనంతరం సయ్యద్ నశీర్ అహ్మద్ మాట్లాడుతూ తాను కేవలం 310 మంది ముస్లిం స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలు వారి చరిత్రను మాత్రమే సేకరించగలిగానని, కొన్ని వేల మంది ముస్లిం స్వాతంత్ర సమరయోధుల చరిత్ర మరుగున పడిపోయిందని, వాటిని వెలికి తీసి నేటి తరానికి అందజేయాల్సిన బాధ్యత చరిత్ర అధ్యాపకులపై ఉందన్నారు. ఉస్మానియా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రా జావెద్ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో జాతీయ భావన పెంపొందించడానికి తోడ్పడతాయని, గత చరిత్రను తెలుసుకోవడంలో ఆసక్తిని పెంచుతాయన్నారు. ఈ సందర్భంగా భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కురాడి చంద్రశేఖర్ కల్కూరా, సిల్వర్‌జూబ్లీ కళాశాల చరిత్ర శాఖ అధ్యక్షులు రెడ్డి ప్రసాద్‌రెడ్డి, ప్రముఖ రచయితలు ఇనాయతుల్లా, అబ్దుల్ అజీజ్ ప్రదర్శనను సందర్శించారు. ఉస్మానియా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, నగరంలోని పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ఎగ్జిబిషన్‌ను వీక్షించారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, చరిత్ర శాఖాధ్యక్షులు షేక్ మసూద్ అహ్మద్, అధ్యాపకులు డాక్టర్ ఎస్ఎం గులాం హుసేన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎ.ఎం.ఘజని, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నగరానికి సరికొత్త హంగులు

- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- గుత్తి పెట్రోల్ సర్కిల్ వద్ద వెండర్, పార్కింగ్ జోన్లు ప్రారంభం


వెండర్ జోన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్యే కాటసాని, కమిషనర్

కల్లూరు: కర్నూలు నగరాన్ని సరికొత్త హంగులతో తీర్చిదిద్దుతున్నామని నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కమిషనర్ ఏ.భార్గవ్ తేజ అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 29వ వార్డు గుత్తి సర్కిల్ వద్ద రూ.40లక్షలతో నిర్మించిన వెండర్, పార్కింగ్ జోన్లను ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పార్కింగ్ జోన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. మహానగరాలకే పరిమితమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలు నగరంలో జరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ నగరంలోని చిరు వ్యాపారుల జీవనోధి దెబ్బతినకుండా, వారి వల్ల ట్రాఫిక్‌కి ఇబ్బంది కలగకుండా, నిరుపయోగ ప్రదేశంలో మంచి ఉద్దేశంతో వెండర్ జోన్లను ఏర్పాటు చేశామన్నారు. వినూత్న ఆలోచనలతో నగరాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నట్లు వెల్లడించారు. కమిషనర్ మాట్లాడుతూ ఏ.క్యాంపులో ఫ్రూట్స్ షాపుల కోసం వెండర్స్ జోన్ ఏర్పాటు చేసి వ్యాపారులకు ఉచితంగా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, అరుణ, లక్ష్మీకాంతరెడ్డి, జయరాముడు, ఎస్ఈ వేణుగోపాల్, ఎంఈ షాకీర్, డీఈఈ గోపాలకృష్ణ, నాయకులు శివశంకర్‌రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, శివారెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షయ హీరో షోరూం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలనతో హీరో షోరూంను ప్రారంభిస్తున్న రవాణా శాఖ అధికారి శ్రీధర్

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని బంగారుపేట వద్ద గురువారం సాయంత్రం అక్షయ హీరో ద్విచక్ర వాహనాల షోరూంను రవాణా శాఖ అధికారి శ్రీధర్, హీరో మోటార్స్ సంస్థ ప్రతినిధులు నల్లూరాయ్, పి.షాజీ, షోరూం ఎండీ టీ. మణిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధి కారి మాట్లాడుతూ హీరో ఉత్పత్తులకు వినియోగదారుల్లో మంచి ఆదరణ ఉందన్నారు. వాహనాల కొనగోలుదారులు వాహనాలతో పాటు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ నగర నడిబొడ్డున అన్ని సౌకర్యాలతో హీరో ద్విచక్ర వాహనాల షోరూం ఏర్పాటు చేశామన్నారు. వాహనాల అమ్మకాలే కాకుండా సర్వీస్, సేల్స్, స్పేర్‌పార్ట్స్ అన్ని అందుబాటులో ఉంటాయన్నారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో గురువారం చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద ఆధ్వర్యంలో భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేశారు. డిసెంబర్ 23వ తేదీన గీతా జయంతి రోజున 1000 మందితో గీతా పారాయణం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం అధ్యక్షులు అధ్యక్షుడు డీవీ రమణ, సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదలను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక 48వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రోజా వీధి, ప్రకాష్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరాలను వివరించారు. స్థానికులు చెప్పిన సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం తగ్గితేనే సమానత్వం వస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. వీటిని పొందిన కుటుంబం ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ ప్రభుత్వం ఎలాంటి సిఫార్సు లేకుండా కేవలం అర్హులకే ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికా బేగం, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు దాదా బాషా, నాయకులు ఖాలిద్, మద్దయ్య, కృష్ణకాంత్, సఫియా ఖాతూన్, జిలానీ, నాసీర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నగరంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి తాను అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ ద్వారా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి పరిష్కారం పొందవచ్చని చెప్పారు.

రోగుల చికిత్సలో కేస్‌షీటే ప్రామాణికం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): రోగులకు అందించే చికిత్సలో కేస్‌షీటే ప్రామాణికమని, రోగికి ఇచ్చిన చికిత్సకు సంబంధించి ప్రతి విషయాన్ని అందులో రాయాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల నర్సింగ్ సిబ్బందితో ఆయన ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. రోగులకు సంబంధించిన ఓపీ, ఐపీ విభాగాల్లో ఉంటే కేస్‌షీట్, ఓపీ పత్రాలు ఎలా భర్తీ చేయాలి, కేస్‌షీట్‌లో రోగికి సంబంధించిన వివరాలపై రెండు రోజుల పాటు ఓరియంటేషన్ కార్యక్రమం ద్వారా వివరిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిలో ఈ-హాస్పిటల్ అప్‌లోడింగ్ అమలు ప్రక్రియ కొనసాగుతోందని, ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని నర్సింగ్ సిబ్బందిని ఆదేశించారు. త్వరలో పేపర్‌లెస్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకు సిద్ధం కావాలని చెప్పారు. రోగులకు సంబంధించిన ఈ-హాస్పిటల్, కేస్‌షీట్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కేస్‌షీట్‌లో ఎలాంటి తప్పులు లేకుండా ఆధార్ అనుసంధానంగా చిరునామా, పేరు తదితర వివరాలు తప్పులు లేకుండా రాయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివ బాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 వెంకట తులశమ్మ, గ్రేడ్-2 నాగమణి, సావిత్రి బాయి తదితరులు పాల్గొన్నారు.

ఏథర్ ఎలక్ట్రిక్ స్కూటర్స్ షోరూం ప్రారంభం


ఏథర్ ఎలక్ట్రికల్ బైక్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో గురువారం సాయంత్రం ఏథర్ ఎలక్ట్రికల్ స్కూటర్స్ షోరూమ్‌ను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రోజురోజుకు ఇంధన ధరలు అడ్డూఅదుపు లేకుండా పోతున్న సమయంలో భవిష్యత్తు ఎలక్ట్రికల్ స్కూటర్లదే అన్నారు. కాలుష్యం లేని వాహనాలు మార్కెట్‌లో దూసుకు వస్తున్నాయన్నారు. అమిగోస్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ షోరూం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత రెడ్డి మాట్లాడుతూ మూడు ప్రత్యేకతలు కలిగిన ఏథర్ వాహనాలు ఆరు రంగుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాటరీని ఒకసారి రీచార్జ్ చేస్తే 110 కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చన్నారు. ఎన్నో అత్యాధునిక ఫీచర్లు, డ్యాష్ బోర్డు నావిగేషన్, బ్లూటూత్, థెఫ్ట్ డిటెక్షన్, రివర్స్ ఆప్షన్ వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

కర్నూలు (హాస్పిటల్): ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్త నిధిలో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ రక్తదానం వల్ల తన ఆరోగ్యంతో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడిన వారవుతారని చెప్పారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, బ్లడ్ అండ్ ఐ డొనేషన్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ శోభన్ బాబు, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ గోనూరు యుగంధర్ శెట్టి, శేషయ్య, డాక్టర్ రమేష్, దోనపాటి ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం


శివ (ఫైల్)

కర్నూలు: కర్నూలులోని కేసీ కెనాల్‌లో గల్లంతైన బుధవారపేటకు చెందిన అంబారి శివ (26) మృతదేహం బయటపడింది. ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం తన బంధువులైన కలసి స్నానం చేయడానికి కొత్త అయ్యప్పస్వామి గుడి దగ్గర ఉన్న కేసీ కెనాల్ వద్దకు చేరుకున్నారు. శివ కేసీ కెనాల్‌లో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి నీళ్లలో పడి గల్లంతయ్యాడు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో బ్రాహ్మణకొట్కూరు శివారులో కేసీ కెనాల్ ఒడ్డున నీటిపై మృతదేహం తేలియాడుతుండగా తల్లి లక్ష్మీదేవి గుర్తించి మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీటీడీకి రక్తహీనత సంకేతం కావొచ్చు

కర్నూలు(హాస్పిటల్): కనెక్టివ్ టిష్యూ డిజార్డర్(సీటీడీ)కి రక్తహీనత సంకేతం కావొచ్చని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వినూషారెడ్డి చెప్పారు. గురువారం ప్రకాష్‌నగర్‌లోని వీఆర్ హాస్పిటల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇటీవల 35 ఏళ్ల ఓ మహిళకు తక్కువ హిమోగ్లోబిన్, శరీరం అంతా వాపుతో అనేక వైద్యకేంద్రాలను సందర్శించిందన్నారు. ఆమెకు పలుమార్లు రక్తమార్పిడి కూడా చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో చికిత్స కోసం వచ్చిన ఆమెకు తాము పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో అరుదైన కనెక్టివ్ టిష్యూ డిజార్డర్ అని నిర్ధారణ అయ్యిందన్నారు. ఇందుకు తగిన వైద్యం అందించిన తర్వాత ఆమె కోలుకున్నట్లు తెలిపారు.

పిల్లలకు ధనుర్వాతం టీకాలు వేయించాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలోని 10, 15 సంవత్సరాలు ఉన్న పిల్లలందరికీ స్పెషల్ డ్రైవ్‌లో కార్యక్రమంలో భాగంగా టెటానస్ డిఫ్తీరియా (ధనుర్వాతం) టీకాలు వేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఆయన స్థానిక ఎన్‌టీఆర్ నగర్‌లోని లక్ష్మీపేట ఎంపీపీ స్కూల్‌లో జరుగుతున్న టెటానస్ డిఫ్తీరియా టీకాల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారంలో జరిగే వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాలలో కూడా ఈ టీకా వేస్తారన్నారు. అనంతరం ఆయన పాఠశాలల్లోని పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అందులో రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు అందజేసి, వారికి ఐరన్ మాత్రల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరాములు, ఏఎన్ఎం, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.